PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 273 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 27 సెప్టెంబర్ 2026


### ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



3లో

### అణగారిన గొంతుకకు చాకలి ఐలమ్మ ఆత్మగౌరవ స్వరం



3లో

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

**- ప్రధాని పదవికి వన్నెతెచ్చిన మహనీయుడు: సీఎం రేవంత్‌రెడ్డి**



**రంగారెడ్డి, సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కోరారు. రంగారెడ్డి జిల్లా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో శనివారం మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందించాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి, దేశ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేలా కీలక ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ మిగతా2లో...




# 30న ఇండియా బ్లాక్ కీలక భేటీ

**- సీఈసీ వ్యవహారం, 'సర్'పై ఉమ్మడి కార్యాచరణకు కసరత్తు**

**న్యూఢిల్లీ:సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల కమిషన్ విశ్వసనీయత, ఎన్నికల సంఘం వ్యవహారశైలి, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో ఇండియా బ్లాక్ కీలక సమావేశానికి సిద్ధమైంది. సెప్టెంబరు 30న న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ పార్టీల నేతలు సమావేశం కానున్నట్లు నవతెలంగాణ తెలిపింది. ఎన్నికల కమిషన్ వ్యవహారంపై భవిష్యత్ మిగతా2లో...

## అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

**తెలంగాణలో 5,008 కేంద్రాల ఆధునీకరణకు చర్యలు**

**రూ.30.04 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి:కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 'సక్షమ్ అంగన్‌వాడీ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 5,008 కేంద్రాలను ఆధునీకరించేందుకు రూ. 30.04 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి వెల్లడించారు.ఆధునీకరణలో భాగంగా చిన్నారులకు అనువైన వాతావరణం, మిగతా2లో...

## ఈసీనెట్‌పై సమీక్షకు ఈసీ ఆదేశం

- సీనియర్ డిప్యూటీ ఈసీ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- ఎస్‌ఐఆర్‌పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనన్న ఎన్నికల సంఘం




2లో

# తెలంగాణ తెగువకు ప్రతీక చాకలి ఐలమ్మ

**- రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనితకు కేసీఆర్ నివాళి**



**హైదరాబాద్,సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమెకు నివాళులు అర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, ధిక్కార స్ఫూర్తికి చాకలి ఐలమ్మ నిలువెత్తు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. నాటి రాచరిక, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా మిగతా2లో...



## నవంబర్ తర్వాత ఇరాన్‌పై మళ్లీ దాడులు : ట్రంప్

**వాషింగ్టన్ సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** కాల్పుల విరమణ కోసం ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించినట్టు తెలుస్తోంది. నవంబరులో అగ్రరాజ్యంలో జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత , టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు సిద్ధమవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్టు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. మిగతా2లో...

# కాంగ్రెస్ నేతలకు సవాల్

- 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి భారీ సభ
- లక్ష మంది జన సమీకరణకు ఏర్పాట్లు.. వెయ్యి బస్సులు



**సిరిసిల్ల,సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలనకు వెయ్యి రోజులు దాటిన సందర్భంగా ఈ నెల 30న సిరిసిల్లలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ కాంగ్రెస్ నేతలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. 'చలో సిరిసిల్ల' పేరుతో చేపడుతున్న కార్యక్రమంలో సీఎం పాదయాత్రతో పాటు భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సభకు లక్ష మంది జనాన్ని సమీకరించాలని మిగతా2లో...

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేస్తాం

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటన**
**ప్రజా సమస్యలనే ప్రధాన అజెండాగా తీసుకెళ్తామని వెల్లడి**



**హైదరాబాద్,సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రత్యక్షంగా పోటీ చేస్తామని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. త్వరలో తమ అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని మిగతా2లో...

## యాదాద్రి విద్యుత్ కేంద్రం నుంచి రోజుకు 14 కోట్ల యూనిట్ల విద్యుత్

**- ఆరు నెలల్లో పూర్తి స్థాయి ఉత్పత్తికి సన్నాహాలు**



2లో

## విజయవంతంగా గణేశ్ నిమజ్జనాలు

**- ప్రశాంతంగా ముగిశాయి.. సీపీ సజ్జనార్**



2లో

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపారని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలోనూ మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని సీఎం పేర్కొన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేయడంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకారం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.

మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో విద్యా హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ--పునరావాస చట్టం వంటి కీలక చట్టాలు అమల్లోకి వచ్చిన విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. భూమిలేని పేదలకు కూడా పరిహారం అందేలా పునరావాస చట్టం ద్వారా హక్కులు కల్పించారని తెలిపారు.మన్మోహన్ సింగ్ జ్ఞాపకార్థం ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం కోరారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలను, దేశానికి అందించిన కృషిని భావితరాలకు గుర్తుచేసే అవకాశం ఏర్పడిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

# 30న ఇండియా బ్లాక్ కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణతో పాటు పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించే అవకాశం ఉంది.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరుతూ పార్లమెంట్‌లో మరోసారి నోటీసు ఇచ్చే అంశాన్ని కూడా సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం. 'సర్' అమలు, ఎన్నికల సంఘం నిర్ణయాలపై తమ అభ్యంతరాలను ఉమ్మడిగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిపక్ష పార్టీలు సమన్వయంతో కార్యాచరణ రూపొందించే ప్రయత్నం చేస్తున్నాయి. **'సర్'పై ఉమ్మడి వైఖరికి కసరత్తు**ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై వివిధ ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సంఘంలోనే 'సర్'కు సంబంధించిన కొన్ని నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు వచ్చిన వార్తలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 30న జరిగే సమావేశంలో ఈ అంశంపై ఉమ్మడి వైఖరిని ఖరారు చేసే అవకాశముంది.ఎన్నికల కమిషన్ వ్యవహారంపై ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం కోసం సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇండియా బ్లాక్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలతో ఆయన చర్చలు జరిపి సమావేశానికి అనుకూలత సాధించే ప్రయత్నం చేస్తున్నట్లు నవతెలంగాణ పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు పలువురు నేతలతోనూ ఆయన సంప్రదింపులు జరిపినట్లు తెలిపింది. **దేశవ్యాప్త ఆందోళనలపై చర్చ**ఎన్నికల కమిషన్ పనితీరు, 'సర్'పై ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు నిరసనలు నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల కమిషన్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు జరిగినట్లు సమాచారం. జమ్మూకాశ్మీర్, అసోం, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, మణిపూర్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లోనూ నిరసనలు నమోదయ్యాయి. సెప్టెంబరు 30 సమావేశంలో దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణ, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహం, 'సర్'పై ఉమ్మడి వైఖరి తదితర అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఆర్‌జేడీ, డీఎంకే, ఆప్ తదితర పార్టీల అగ్రనేతలు సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. **మరోసారి తొలగింపు నోటీసుపై కసరత్తు** జ్ఞానేష్ కుమార్‌పై పార్లమెంట్‌లో మరోసారి తొలగింపు నోటీసు ఇచ్చే అంశంపైనా ప్రతిపక్ష పార్టీలు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసు సమర్పించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో 'సర్' అమలుపై తమ అభ్యంతరాలను ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇక సెప్టెంబరు 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో ఎన్నికల కమిషన్ అంశంతో పాటు తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది. అనంతరం సెప్టెంబరు 30న జరిగే ఇండియా బ్లాక్ సమావేశంలో ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఈసీనెట్‌పై సమీక్షకు ఈసీ ఆదేశం

**న్యూఢిల్లీ:సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈసీనెట్ వ్యవస్థ పనితీరుపై సమీక్ష చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో ఏర్పాటయ్యే ఈ కమిటీలో ఐఐటీ లేదా ఐఐఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడిని కూడా చేర్చనున్నారు. ఈసీనెట్ సంబంధిత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుందా అనే అంశాన్ని కమిటీ పరిశీలించి నివేదిక సమర్పించనుంది. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఈసీనెట్, ఓటరు నమోదు ప్రక్రియపై వివాదం నెలకొన్న సమయంలో ఈ నిర్ణయం వెలువడింది. ఈసీనెట్‌లో రాష్ట్రస్థాయి ఎన్నికల అధికారులకు వారి చట్టబద్ధ అధికారాలకు అనుగుణంగా పాత్ర ఆధారిత ప్రాప్యత ఉందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు ఇచ్చిన సూచనల ఆధారంగా పోర్టల్‌లో ఇప్పటికే పలు మార్పులు చేసినట్లు తెలిపింది.ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని ఉత్తర్వులు, షెడ్యూళ్లను ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ పేర్కొంది. 2025 జూన్ 24న జారీ చేసిన ఎస్ఐఆర్ ఉత్తర్వును సుప్రీంకోర్టు 2026 మే 27న సమర్థించిందని తెలిపింది. ఎస్ఐఆర్‌పై కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయంటూ వచ్చిన కథనాల నేపథ్యంలో ఈసీ ఈ వివరణ ఇచ్చింది.ఇదే సమయంలో ఎస్ఐఆర్‌లో నోటీసులు అందుకున్న ఓటర్లకు ప్రక్రియను సులభతరం చేసే చర్యలను కూడా ఈసీ ప్రకటించింది. అవసరమైన పత్రాల సేకరణకు బూత్ స్థాయి అధికారులు సంబంధిత ఓటర్ల ఇళ్లకు వెళ్లేలా నిర్ణయించింది. ఢిల్లీ, మహారాష్ట్రలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు గడువును పొడిగించడంతో పాటు భవిష్యత్తులో ఎన్నికల సంఘం సమావేశాల అజెండాను ముందుగానే సభ్యులకు అందించి, సమావేశ నిర్ణయాల వివరాలను నమోదు చేయాలని నిర్ణయించింది.ఈసీనెట్, ఓటరు జాబితా నిర్వహణకు సంబంధించిన అధికారాలపై ఇటీవల ఎన్నికల కమిషనర్ల మధ్య అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో తాజా సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సంఘం మాత్రం తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది.

## యాదాద్రి విద్యుత్ కేంద్రం నుంచి రోజుకు

# 14 కోట్ల యూనిట్ల విద్యుత్

**• ఆరు నెలల్లో పూర్తి స్థాయి ఉత్పత్తికి సన్నాహాలు**

**హైదరాబాద్,సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి తాప విద్యుత్ కేంద్రాన్ని పూర్తి స్థాయి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈ కేంద్రం నుంచి రోజుకు సుమారు 14 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.యాదాద్రి తాప విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు ఉత్పత్తి విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది.**దసరాలోపు పూర్తి స్థాయి ఉత్పత్తి** యాదాద్రి విద్యుత్ కేంద్రంలో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి దసరాలోపు అన్ని విభాగాల నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇప్పటికే కొన్ని విభాగాల నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైందని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.**బొగ్గు సరఫరాపై ప్రత్యేక దృష్టి** యాదాద్రి విద్యుత్ కేంద్రం నిరంతరాయంగా పనిచేయాలంటే అవసరమైన నాణ్యమైన బొగ్గు సరఫరా అత్యంత కీలకం. అందువల్ల కేంద్రానికి అవసరమైన బొగ్గును తగినంత పరిమాణంలో అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహానది బొగ్గు క్షేత్రాలు, బొగ్గు సంస్థల నుంచి అవసరమైన బొగ్గును సమీకరించే అంశంపై దృష్టి సారించారు.ముఖ్యమంత్రి విద్యుత్ శాఖపై నిర్వహించిన సమీక్షలో యాదాద్రి విద్యుత్ కేంద్రం పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన బొగ్గు, ఇతర వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.**రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఊతం** రాష్ట్రంలో పరిశ్రమలు, వ్యవసాయం, గృహ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది.

ఈ పరిస్థితుల్లో యాదాద్రి విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తికి మరింత బలం చేకూరనుంది. రోజుకు 14 కోట్ల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం అందుబాటులోకి రావడం ద్వారా భవిష్యత్తులో పెరిగే విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడనుంది.యాదాద్రి విద్యుత్ కేంద్రంతో పాటు రాష్ట్రంలోని ఇతర తాప విద్యుత్ కేంద్రాల్లోనూ ఉత్పత్తిని పెంచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందుబాటులో ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడంతో పాటు విద్యుత్ కేంద్రాల్లో తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# కాంగ్రెస్ నేతలకు సవాల్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు.జిల్లాలోని మండలాల వారీగా కాంగ్రెస్ ముఖ్య నేతలతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వరుసగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. సభకు ప్రజలను తరలించే ఏర్పాట్లు, పాదయాత్రలో పాల్గొనే వారి సమీకరణ, ఇతర నిర్వహణ అంశాలపై నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి జన సమీకరణ కోసం సుమారు వెయ్యి బస్సులను వినియోగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.సిరిసిల్ల మొదటి బైపాస్ రోడ్డులోని ఖాళీ స్థలంలో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. అంబేద్కర్ చౌరస్తా మీదుగా చేనేత చౌక్ నుంచి రగుడు సమీపంలోని సభా ప్రాంగణం వరకు సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. సిరిసిల్ల, కోనరావుపేట ప్రాంతాల నుంచి రెండు వేల మందికి పైగా పాదయాత్రలో పాల్గొనేలా సన్నాహాలు చేస్తున్నారు.సభా ఏర్పాట్లను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో పాటు ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయరమణారావులు పరిశీలించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ తదితర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. **రాజకీయంగా ఆసక్తి** సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు బలమైన రాజకీయ ప్రాబల్యం ఉండటంతో కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఈ సభపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి భారీ సభ నిర్వహిస్తుండటంతో కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. జిల్లాలో కొనసాగుతున్న జన సమీకరణ, సన్నాహక సమావేశాలతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఇటీవల సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించిన భూముల వ్యవహారాలు, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన భూ ఆక్రమణలపై విచారణ అంశాలు కూడా రాజకీయంగా చర్చకు వచ్చాయి.

# నవంబర్ తర్వాత ఇరాన్‌పై మళ్లీ దాడులు : ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ ఓడరేవులపై అమెరికా తమ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే , దానికి బదులుగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతోపాటు అణు చర్చలను పునరుద్ధరిస్తామని టెహ్రాన్ ప్రతిపాదించింది.

ఖతార్ మధ్యవర్తుల ద్వారా ఈ శాంతి ప్రణాళికను అగ్రరాజ్యానికి తెలియజేశామని , దీనిపై ఒప్పందం కుదిరితే హర్మూజ్‌ను ఏడు రోజుల్లో తిరిగి తెరుస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే దీనిపై ట్రంప్ విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, హర్మూజ్ పేరుకు బదులుగా ట్రంప్ జలసంధి అని రాసి ఉన్న మ్యాప్ ఫోటోను ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం హర్మూజ్‌లో అమెరికా దిగ్బంధనంతోపాటు ఇరాన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి.

# అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన మౌలిక వసతులు, విద్యా సంబంధిత సదుపాయాలు, ఆరోగ్యంపోషణకు అవసరమైన వసతులను అభివృద్ధి చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలుగానే కాకుండా చిన్నారుల ప్రాథమిక విద్య, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి పునాదిగా నిలిచేలా చర్యలు చేపట్టనున్నారు.రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతుల మెరుగుదలకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాదిలో 5,938 కేంద్రాలకు మరుగుదొడ్లు, 3,815 కేంద్రాలకు తాగునీరు, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు.అంగన్‌వాడీల బలోపేతంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు ఆరేళ్లలోపు పిల్లలకు ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ వంటి సేవలు మెరుగ్గా అందే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వ్యవస్థను మరింత పటిష్టం చేసి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయి.

# తెలంగాణ తెగువకు ప్రతీక చాకలి ఐలమ్మ

(మొదటి పేజీ తరువాయి)

రైతాంగ హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు.భూస్వాముల ఆధిపత్యాన్ని ఎదురించి ప్రజల హక్కుల కోసం ఐలమ్మ పోరాడారని కేసీఆర్ గుర్తుచేశారు. అణచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన ధైర్యం, న్యాయపోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం, బహుజన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం సామాజిక న్యాయానికి ప్రేరణగా నిలిచిందన్నారు.చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ సాధన ఉద్యమంలో ధిక్కార భావన కొనసాగిందని కేసీఆర్ పేర్కొన్నారు. ఆమె పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు తమ ప్రభుత్వ హయాంలో ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించామని తెలిపారు.ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా రైతాంగం, మహిళలు, శిశువులు, బహుజన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, కులవృత్తులకు ప్రోత్సాహం కల్పించడం, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే ఆమెకు నిజమైన నివాళి అని అన్నారు.ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం ఐలమ్మ చూపిన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)


ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు పేర్కొన్నారు.ఖైరతాబాద్ స్థానం ఖాళీ కావడంతో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది. దానం అనర్హతకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే సమయాన్ని బట్టి ఎన్నిక నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని నివేదికలు పేర్కొంటున్నాయి.ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కవిత వ్యాఖ్యానించారు. ఈ అంశంపై కాంగ్రెస్‌పై ఆమె విమర్శలు చేశారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రి యలో గందరగోళం ఉందని, రీ-ఎడిట్ అవకాశం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొని, ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వంపై కూడా కవిత పలు విమర్శలు చేశారు. ఫామ్‌హౌస్‌ల అంశంతో ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆమె ఆరోపించారు. తాను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన ఆస్తుల వివరాలకు సంబంధించి ఆరోపణలు నిరూపిస్తే ఆ మొత్తాన్ని తిరిగి ఇస్తానని పేర్కొన్నారు. ఖైరతా బాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టి ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

# విజయవంతంగా గణేశ్ నిమజ్జనాలు

**హైదరాబాద్:సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. నిమజ్జనాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.గణేశ్ శోభాయాత్రలు, నిమజ్జనాల సందర్భంగా పోలీసు సిబ్బంది నిరంతరం విధుల్లో పాల్గొన్నారని సీపీ తెలిపారు. ప్రధాన మార్గాలు, నిమజ్జన ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గణేశ్ విగ్రహాల నిమజ్జనాలను పోలీసులు సమన్వయంతో పర్యవేక్షించారని సజ్జనార్ తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించడం వల్లే నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు.నిమజ్జనాల్లో విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించిన ప్రజలకు, గణేశ్ ఉత్సవ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోనూ పండుగలు, ప్రజా కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తుందని సజ్జనార్ పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ సమస్యలను సీడబ్ల్యూసీ దృష్టికి రేవంత్

**- 29న ఢిల్లీకి సీఎం**



**హైదరాబాద్ :సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ నెల 29న ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించనున్నారు. ఓటర్లకు నోటీసులు, పత్రాల సమర్పణ, ఓటర్ల జాబితా సవరణలో ఎదురవుతున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అనుసరించాల్సిన తదుపరి కార్యాచరణపై కూడా చర్చించే అవకాశం ఉంది.

# ములుగు పర్యాటక ప్రగతికి రాష్ట్రస్థాయి గుర్తింపు

**• జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావుకు ఘన సత్కారం**

**ములుగు జిల్లా సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామం వేదికగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి, ములుగు జిల్లా పర్యాటక ప్రగతికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన కాకతీయుల శిల్పకళా వైభవం రామప్ప దేవాలయం, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన తెలంగాణ




కుంభమేళా మేడారం సమ్మక్కసారలమ్మ జాతర, లక్నవరం సరస్సువేలాడే వంతెన, తెలంగాణ నయాగరాగా ప్రసిద్ధి చెందిన బొగత జలపాతం, ప్రకృతి వనమూలికల నడుమ దట్టమైన గుట్టపై వెలసిన శ్రీ మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం తదితర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషికి ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు మెరుగైన వసతులు కల్పిస్తూ స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో ప్రతిభ కనబరుస్తున్న అధికారుల సేవలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవ, ప్రోత్సాహం, నిరంతర పర్యవేక్షణతో ములుగు జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. మంత్రి అందిస్తున్న సలహాలు, సూచనలు, ఆదేశాలు జిల్లా పర్యాటక ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ గౌరవం జిల్లా అధికారుల సమిష్టి కృషికి దక్కిన గుర్తింపని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, ప్రకృతి, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి దేశవిదేశాల పర్యాటకులను ఆకర్షించేలా నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు.

# అణగారిన గొంతుకకు చాకలి ఐలమ్మ ఆత్మగౌరవ స్వరం

**- తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి, హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్ చంద్ర**

**- భూమి కోసం పోరాడిన వీరనారి స్ఫూర్తి భావితరాలకు బాట..**

**- మహిళా శక్తికి ఆమె జీవితం ఓ ఆదర్శం**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** అన్యాయాన్ని ఎదిరించేందుకు ఆడవారికి అడ్డంకులు లేవని, ఆత్మగౌరవం కోసం చేసే పోరాటానికి ధైర్యమే ఆయుధమని చాటి చెప్పిన వీరనారి చాకలి ఐలమ్మ అని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి, హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్ చంద్ర అన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం ఖమ్మంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేతినేని హరీష్ చంద్ర మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ జీవితం కేవలం ఒక మహిళా పోరాట గాథ మాత్రమే కాదని, అణచివేతకు



వ్యతిరేకంగా ఆత్మగౌరవం కోసం నిలబడిన ఓ సామాన్య మహిళ అసామాన్య శక్తిగా ఎదిగిన చారిత్రక అధ్యాయమని అన్నారు. నైజాం పాలన కాలంలో భూస్వాములు, రజాకార్ల దౌర్జన్యాలకు భయపడకుండా ఐలమ్మ ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారని గుర్తుచేశారు. తన హక్కు కోసం, తన భూమి కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిందన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఓ మహిళ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ఉద్యమానికి ప్రతీకగా నిలవడం మహిళా శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాటంలో కనిపించేది కేవలం భూమి కోసం జరిగిన పోరాటం మాత్రమే కాదని, మనిషిగా గౌరవంగా జీవించే హక్కు కోసం సాగిన ఆత్మగౌరవ పోరాటమని అన్నారు. ఆమె ధైర్యం, తెగువ, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ముఖ్యంగా మహిళలు తమలోని ఆత్మవిశ్వాసాన్ని గుర్తించి, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భావితరాల యువత చాకలి ఐలమ్మ జీవితాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఎదురయ్యే ప్రతి సమస్యకు భయపడకుండా ధైర్యంతో ముందడుగు వేయడం, సమాజంలో అణగారిన వర్గాల పట్ల మానవీయ దృక్పథంతో నిలబడటం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. చరిత్రలో తమ హక్కుల కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను యువతకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో నేటి యువత సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, న్యాయం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయల కోటేశ్వరరావు, పరిటాల నాగార్జున, నామ ఉపేందర్, కొండబాల అశోక్, తాళ్లూరి నారాయణ, దామల శివ పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు స్వచ్ఛమైన నీటి సౌకర్యం

**నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటు సేవా కార్యక్రమాలు అభినందనీయం: ఎంఈఓ నెహ్రూ నాయక్**

**హనుమకొండ, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ భవిత సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫయర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హనుమకొండ మండల విద్యాశాఖ అధికారి నెహ్రూ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్యూరిఫయర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా గ్లాసులతో తాగునీటిని అందించిన ఎంఈఓ నెహ్రూ నాయక్, దివ్యాంగ విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాన్ని చేపట్టిన నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులను అభినందించారు. ప్రార్థనతో పాటు ఆచరణలో సేవకు ప్రాధాన్యత ఇవ్వాలన్న మదర్ థెరిస్సా సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.




సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా దివ్యాంగ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు సంస్థ తనవంతు సహకారం అందించిందన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని నెహ్రూ నాయక్ అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు నూగూరి చంద్రమోహన్,



కోర్ కమిటీ సభ్యుల సహకారంతో ఈ వాటర్ ప్యూరిఫయర్‌ను ఏర్పాటు చేశారు. అవసరమైన చోట సేవ చేయాలనే లక్ష్యంతో సంస్థ తరఫున భవిష్యత్తులోనూ పలు కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా కోశాధికారి డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ కోర్ కమిటీ సభ్యులు డి. శశికిరణ్, ఎం. శ్రీనివాస్, కె. శ్రీధర్, కాశీనాథ్, రఘువంష్, సుభాష్ రామకృష్ణ, ఆనంద్, ఐఈఆర్పిఎం రజిత, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ కె. మాదవి పాల్గొన్నారు.

## 28న కరీంనగర్‌లో ‘శాతవాహన గ్రామీణ సంత‘ వాల్ పోస్టర్ ఆవిష్కరణ...

**- పోస్టర్‌ను ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్...**

**కరీంనగర్, సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** పర్యావరణ పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఈనెల 28న కరీంనగర్లో గ్రామ భారతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న “శాతవాహన గ్రామీణ సంత“ వాల్ పోస్టర్‌ను శనివారం రోజున మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆవిష్కరించారు. విష రహిత ఆహార ఉత్పత్తిదారులు, చేతివృత్తుల వారు , వినియోగదారులకు పరస్పర తోడ్పాటును అందించే ఏకైక లక్ష్యంతో ఈ సంతను నిర్వహిస్తున్నట్టు గ్రామ భారతి బాధ్యులు తెలిపారు. సెప్టెంబర్ 28 సోమవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు కరీంనగర్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్లో ఈ సంత జరుగుతుందని తెలిపారు. మొత్తం 60 స్టాల్స్‌తో, అంచనాగా 1200 మంది వినియోగదారుల భాగస్వామ్యంతో ఈ సంత జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఇ. వెంకటేశ్వర్లు, ఎ.ఇ. సతీష్‌తో పాటు శాతవాహన గ్రామీణ సంత రాష్ట్ర, జిల్లా కార్యకర్తలు జిన్నా సత్యనారాయణ రెడ్డి, రఘురాం రెడ్డి, నాల్యా మడుగుల శంకరయ్య, గాలిపెల్లి నాగేశ్వరరావు, కూర్మాచలం మునీందర్, గొల్లె తిరుపతి, క్యాస మధు, సంపత్ పాల్గొన్నారు.




# పల్లె ప్రకృతి వనాలపై విచారణ జరపాలి




**మల్లంపల్లి, సెప్టెంబర్ 26 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలంలోని పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల నిర్వహణపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ నేత మెర్గు రాజు డిమాండ్ చేశారు. హరితహారం స్ఫూర్తితో ఏర్పాటు చేసిన వనాలు సరైన నిర్వహణ లేక పచ్చదనం కోల్పోతున్నాయని, మొక్కలకు నీరు అందక ఎండిపోతున్నాయని ఆరోపించారు. ప్రజలు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, యువత కోసం నిర్మించిన క్రీడా ప్రాంగణాలు కొన్ని చోట్ల నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, తాగుబోతులకు అడ్డాలుగా మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. మండలంలోని ప్రతి పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాన్ని అధికారులు స్వయంగా పరిశీలించి పరిస్థితిపై నివేదిక బహిర్గతం చేయాలని కోరారు. మొక్కల సంరక్షణ, పారిశుధ్యం, వసతుల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మెర్గు రాజు డిమాండ్ చేశారు. “ప్రజాధనంతో నిర్మించిన వసతులు ప్రజలకే ఉపయోగపడాలి. నిర్లక్ష్యంతో పాడైపోయేందుకు వీల్లేదు” అని ఆయన అన్నారు.


## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**ములుగు సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ములుగు జిల్లా సంక్షేమ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. రామ్మోహన్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన వీరవనిత అని కొనియాడారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన తెగువ, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మహిళా చైతన్యానికి, సామాజిక మార్పుకు చాకలి ఐలమ్మ జీవితం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సమానత్వం, మహిళల హక్కులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేరెళ్ల శంకర్, పరికిరాల రవి, ఎన్నిల్ల మహేందర్, ముంజాల దీక్షిత్, కండకట్టు సారయ్య, బాసాని రామ్మూర్తి తదితర రజక సంఘం నాయకులు, వివిధ వెనుకబడిన తరగతుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. సంక్షేమ భవన్ కార్యాలయ సిబ్బంది, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉద్యోగులు మేఘగిరి, సరీత, మానస, సుజాత, ప్రతాప్ రత్నాకర్, కుమారస్వామి, జి. గోపాల్‌రావు, నాలుగో తరగతి ఉద్యోగులు, విరేకదారులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# గ్రామకంఠం భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలి

**- పాత రికార్డులు పరిశీలించి.. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలి: వెలుపగొండ సతీష్**






**ములుగు, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మున్సిపల్ పరిధిలోని గ్రామకంఠం భూమిని ఆక్రమణల నుంచి పరిరక్షించాలని నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుపగొండ సతీష్ అధికారులను కోరారు. 1976 ఏప్రిల్ 15న అప్పటి గ్రామపంచాయతీ సర్పంచ్ ద్వారా నాయి బ్రాహ్మణ సంఘానికి 4 గుంటల 55 పైసల స్థలం కేటాయించినట్లు తెలిపారు. అప్పటి నుంచి సదరు స్థలం నాయి బ్రాహ్మణ సంఘం ఆధీనంలోనే ఉందని, ప్రస్తుతం కొంతమంది వ్యక్తులు స్థలంలోని కొంత భాగాన్ని ఆక్రమించుకున్నట్లు ఆరోపించారు. స్థలానికి సంబంధించిన పాత పంచాయతీ, రెవెన్యూ రికార్డులను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి వాస్తవ హద్దులను గుర్తించడంతో పాటు రికార్డుల ఆధారంగా స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్రమణలు ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని స్థలాన్ని పరిరక్షించి నాయి బ్రాహ్మణ సంఘానికి న్యాయం చేయాలని సతీష్ కోరారు.

# చాకలి ఐలమ్మను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి..



**మహబుబాబాదు. సెప్టెంబర్ 26.పిసిడబ్లూ న్యూస్ ప్రతినిధి:** కురవి మండలం కొత్తూరు(సి)గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్ని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్ని మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆమె పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దారోజి శ్రీనివాస్. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు. వార్డు సభ్యులు జాటోతు సుజాత. ఝాన్సీ. కొంపెల్లి మల్లయ్య గౌడ్. చిట్టూరి లక్ష్మి నారాయణ.సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు. పాల్గొన్నారు..

# శారీ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన ఏలూరి శ్రీనివాసరావు



**ఖమ్మం, ప్రతినిధి సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగరంలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో శనివారం ఘనంగా నిర్వహించిన ఖమ్మం జిల్లా కలెక్టర్ సిసి శ్రీ రాచకొండ సాయి నరేష్ కుమార్తె హాఫ్ శారీ వేడుకకు టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు, టీజీఈ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీ ఏలూరి శ్రీనివాసరావు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఏలూరి శ్రీనివాసరావు.. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ విద్య, విజ్ఞానం, అభివృద్ధి రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీ కొణిదెన శ్రీనివాస్,టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీ జెడ్.ఎస్. జైపాల్, టీజీవోస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ శ్రీ గంగవరపు నరేంద్ర, శ్రీ మల్లెల రవీంద్ర ప్రసాద్, రాజ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీ వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ నాయకులు అస్లాం, కోటపాటి రుక్మారావు, పవన్, బిట్ట ప్రవీణ్, జంగం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

# భారత ఆర్థిక వ్యవస్థకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు మన్మోహన్: ఎమ్మెల్యే, డిసిసి చీఫ్ మేడిపల్లి సత్యం

### అవినీతి మచ్చలేని నాయకుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ - మేడిపల్లి సత్యం

### డిసిసి కార్యాలయంలో మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలు..




**కరీంనగర్,సెప్టెంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు మాజీ ప్రధాని, మాజీ ఆర్థిక శాఖ మంత్రి స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం హాజరై మాజీ సుడా చైర్మన్ లికోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, రామిడి రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లిసర్దార్ అమన్ జిత్ సింగ్ తదితరులతో కలిసి డా. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ..."భారతదేశ ఆర్థిక వ్యవస్థకు నూతన దిశానిర్దేశం చేసిన మహనీయుడు, మౌనముని, విశ్వవిఖ్యాత ఆర్థికవేత్త డా. మన్మోహన్ సింగ్. ఆయన మాటలు తక్కువ, చేతలు ఎక్కువ. 1991లో దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని గట్టెక్కించిన ధీరుడు. 10 సంవత్సరాలు ప్రధానిగా ఉండి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు చట్టం వంటి ఎన్నో చారిత్రాత్మక పథకాలు ఆయన హయాంలోనే వచ్చాయి. అవినీతి మచ్చలేని నాయకుడు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం మన్మోహన్ సింగ్.ఆయన చూపిన బాటలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తుంది. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనందరి బాధ్యత" అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాడే శంకర్, కుంభాల రాజ్ కుమార్, అయోధ్య గౌడ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం కృషి చేయాలి

### - చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్



**కురవి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, ధీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను కురవి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్, మండల పార్టీ ఉపాధ్యక్షులు దొంగల జనార్దన్ రెడ్డి, మలిశెట్టి వేణు, మోదుగులగూడెం ఉపసర్పంచ్ శ్రీధర్ గౌడ్, కొర్ని అనీల్, అయ్యగారిపల్లి సర్పంచ్ జక్కుల మాధవినాగన్న, జిల్లా రజక సంఘం అధ్యక్షులు చెన్నూరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

### సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

### బైపాస్ రోడ్డులో సీపీఐ రాస్తారోకో



**ఖమ్మం, ప్రతినిధి సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం బైపాస్ రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం వ్యవహారశైలి కళంకం తెచ్చిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల ప్రజాస్వామ్య హక్కులను ప్రభావితం చేసే విధంగా ఎన్నికల వ్యవస్థలో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు.ఎన్నికల సంఘం వ్యవహారాలపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే విధంగా జోక్యం జరిగిందని సురేష్ ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు.జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన ఎన్నికలపై సమీక్ష జరిపి, అవకతవకలు జరిగినట్లు తేలితే ఆయా ఎన్నికలపై తగిన చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు రాజకీయాలకు అతీతంగా ఎన్నికల సంఘం పనిచేయాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వ విధానాలపై కూడా సురేష్ విమర్శలు చేశారు. ధరల నియంత్రణలో వైఫల్యం, కార్మిక చట్టాల్లో మార్పులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన విధానాలు తదితర అంశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. రాజీనామా అనంతరం ఆయనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఈ రాస్తారోకో కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బీజీ క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, దొండపాటి రమేష్, జాగర్లమూడి రంజిత్, బెజవాడ రవి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, మల్లికార్జున్, యానాలి సాంబశివరెడ్డి, యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# కోతులు కొండముచ్చుల బీభత్సం

● కొండముచ్చు దాడిలో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు ● నివారణ చర్యలకు ఇంకా ఎన్నాళ్లు..? ● వరుస ఘటనలతో కల్లూరు ప్రజల్లో ఆందోళన



**కల్లూరు, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణంలో కొండముచ్చులు, కోతులు, కుక్కల సంచారం ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా మెయిన్‌రోడ్డులో ఎలక్ట్రికల్ పనులు చేస్తున్న ఖమ్మంపాటి క్రాంతిపై కొండముచ్చు అకస్మాత్తుగా దాడి చేయడంతో చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఊహించని దాడితో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కొండముచ్చులు, కోతులు స్వైర విహారం చేస్తున్నా నియంత్రణ చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.ఇంకెందరు గాయపడాలి, ప్రాణనష్టం జరిగే వరకు వేచి చూడాలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వరుస ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్, అటవీశాఖ అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టి, కొండముచ్చుల నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# భక్తి బాటలో హనుమాన్ నామస్మరణ..

- ఆలయ చైర్మన్ కాజా మురళీకృష్ణ
- అంగరంగ వైభవంగా శోభాయాత్ర
- ఆధ్యాత్మిక శోభతో మార్మోగిన కమాన్ బజార్..
- 600 మంది భక్తులకు అన్నదానం..
- భక్తి, సేవకు ప్రతీకగా వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :**హనుమాన్ నామస్మరణతో కమాన్ బజార్ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయని ఆలయ చైర్మన్ కాజా మురళీకృష్ణ అన్నారు. భక్తి, సేవ, సమైక్యతకు ప్రతీకగా కమాన్ బజార్ రైల్వే గేట్ సమీపంలోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో శ్రీ హనుమాన్ భక్తబృంద కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జీ శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, హనుమాన్ నామస్మరణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.భక్తి ఒక్కటే కాదు.. సేవ కూడా దైవారాధనే అన్న భావనను చాటుతూ మధ్యాహ్నం సుమారు 600 మంది భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ప్రేమతో అన్నప్రసాదాన్ని అందించడం ద్వారా నిర్వాహకులు సేవాభావాన్ని చాటుకున్నారు. అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి పల్లకి సేవతో శోభాయాత్ర ప్రారంభమైంది. పల్లకిలో కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భజనలు, హనుమాన్ నామస్మరణలు, భక్తి గీతాలతో శోభాయాత్ర సాగుతుండగా పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించిపోయాయి. వయసుతో సంబంధం లేకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి నామస్మరణ చేశారు.హనుమంతుడి భక్తి అంటే ధైర్యం.. సేవ అంటే మానవత్వం అనే సందేశాన్ని శోభాయాత్ర చాటిచెప్పింది. భక్తులు పరస్పరం ఆప్యాయంగా కలుసుకుంటూ, ఒకరికొకరు సహకరించుకుంటూ శోభాయాత్రలో పాల్గొనడం భక్తి వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.అనంతరం రాత్రి 8 గంటలకు భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు సేవాభావాన్ని పంచేలా కార్యక్రమాలను నిర్వహించడం పట్ల భక్తులు నిర్వాహకులను అభినందించారు.ప్రతి నెల 27వ తేదీన భక్తబంధు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తులను ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ కార్యక్రమాల్లో భక్తుల భాగస్వామ్యాన్ని మరింత పెంచడంతో పాటు, భక్తి భావనతో పాటు సేవా స్ఫూర్తిని కూడా ప్రజల్లో పెంపొందించేలా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.భక్తుల సహకారం, సమష్టి భాగస్వామ్యంతోనే శోభాయాత్ర విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. భక్తి, సేవ, అన్నదానం, ఆధ్యాత్మికత కలగలిసిన ఈ కార్యక్రమం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేలా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాజా మురళీకృష్ణ, యక్కల ఆనంద్ కుమార్, బోనగిరి శ్రవణ్, తేరాల రవికిరణ్, బూర్లే పుల్లారావు, చల్లా జగదీష్, వందనపు మధు, నక్కా లక్ష్మీనారాయణ, టి.ఎస్. చక్రవర్తి, సిద్ధంశెట్టి శ్రీకాంత్, కొదుమూరు భద్రయ్య, కొంకిమళ్ల కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు, ఈఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



**ములుగు సెప్టెంబర్ 26 ( పి సి డబ్ల్యూ న్యూస్):** భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 28న ములుగు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడానికి యువత, రక్తదాతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న అనేక మంది రోగులకు అత్యవసరంగా రక్తం అవసరమవుతోందని తెలిపారు. ముఖ్యంగా ములుగు ఏజెన్సీ ప్రాంతంలో రక్తహీనతతో బాధపడుతున్న వారు అధికంగా ఉన్నారని, అత్యవసర సమయాల్లో సకాలంలో రక్తం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా రక్తదానం చేయడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని కోరారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరి సహకారం విలువైనదేనని, ప్రజల భాగస్వామ్యంతో రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ జీతం.. ప్రైవేట్ ప్రాక్టీస్...?

- కల్లూరు ప్రభుత్వ వైద్యుడి వ్యవహారంపై ప్రశ్నల వర్షం
- తిరువూరులో ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ నిర్వహణ.. వారం రోజుల్లో ఇద్దరు మహిళల మృతి
- డెలివరీ అనంతరం డెంటల్ డాక్టర్ దీప్తి మృతి.. వారం క్రితం కుమారి మృతి
- విధులు ఇక్కడ? ప్రాక్టీస్ అక్కడ? సమగ్ర విచారణకు డిమాండ్





కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జిల్లా అధికారి రాజశేఖర్ గౌడ్

**కల్లూరు, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కల్లూరు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సూపరిశీటెండెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్‌కు సంబంధించిన వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ వైద్యుడిగా కల్లూరులో బాధ్యతలు నిర్వహించాల్సిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లోని తిరువూరు పట్టణంలో ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర శాఖాపరమైన విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. తిరువూరులోని ఎంవీఎస్ సర్జికల్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోమ్‌లో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు మృతి చెందడంతో ఈ అంశం మరింత వెలుగులోకి వచ్చింది. వరుస మరణాల నేపథ్యంలో అధికారులు ఆసుపత్రిపై చర్యలు చేపట్టి, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొత్త పేషెంట్లను చేర్చుకోవద్దని, వైద్య సేవలు నిర్వహించవద్దని ఆదేశించినట్లు సమాచారం. **డెలివరీ అనంతరం డెంటల్ డాక్టర్ మృతి** తిరువూరు శాంతినగర్‌కు చెందిన తాళ్ల దీప్తి డెంటల్ డాక్టర్‌గా పనిచేస్తున్నట్లు ప్రసవం కోసం ఎంవీఎస్ నర్సింగ్‌హోమ్‌కు వచ్చిన ఆమె మగబిడ్డకు జన్మనిచ్చిన అనంతరం అధిక రక్తస్రావంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి విషమించిన సమయంలో మెరుగైన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి తరలించడంలో ఆలస్యం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు సమాచారం. అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. **వారం క్రితం మరో మహిళ మృతి** ఇదే ఆసుపత్రిలో వారం రోజుల క్రితం మైలవరం మండలం మొరుసుమల్లి గ్రామానికి చెందిన బండారు కుమారి (45) గాల్‌బ్లాడర్ స్టోన్‌కు ఆపరేషన్ చేయించుకున్న అనంతరం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుటుంబ సభ్యురాలి మృతికి కారణమని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టినట్లు సమాచారం. ఇలా కొద్దిరోజుల వ్యవధిలోనే రెండు మరణాలు చోటుచేసుకోవడంతో ఆసుపత్రి వైద్య సేవలు, ఆపరేషన్ల విధానం, అత్యవసర వైద్య సదుపాయాలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. **కల్లూరులో ప్రభుత్వ ఉద్యోగం.. తిరువూరులో ప్రైవేట్ వైద్యం?** డాక్టర్ రమేష్ కల్లూరు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాధ్యతలు నిర్వహిస్తుండగా, తిరువూరులో ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ నిర్వహణతో పాటు వైద్య సేవలు అందిస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ వైద్యుడిగా నియమితులైన చోటే పూర్తి స్థాయి విధులు నిర్వహిస్తున్నారా, ప్రభుత్వ విధులకు హాజరు నమోదవుతున్న సమయంలో తిరువూరులో ప్రైవేట్ వైద్య సేవలు ఎలా కొనసాగుతున్నాయి, ప్రభుత్వ ఉద్యోగిగా ప్రైవేట్ వైద్య ప్రాక్టీస్‌కు అనుమతి ఉందా, ఆసుపత్రి నిర్వహణలో ఆయన పాత్ర ఏమిటి, అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఖజానా నుంచి జీతం పొందుతూ, అదే సమయంలో మరో రాష్ట్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు నిజమా, అన్న అంశాన్ని సంబంధిత శాఖ అధికారులు రికార్డుల ఆధారంగా తేల్చాల్సిన అవసరం ఉంది. **గత ఘటనలపైనా ఆరోపణలు** డాక్టర్ రమేష్‌పై గతంలోనూ కొన్ని ఆపరేషన్లకు సంబంధించి ఆరోపణలు వచ్చాయని, చికిత్స అనంతరం రోగులు మృతి చెందిన సందర్భాల్లో కుటుంబాలతో ఆర్థికంగా రాజీ చేసుకున్నారనే ఆరోపణలు కొందరు బాధితులు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక విచారణ నివేదికలు, న్యాయపరమైన నిర్ధారణ ప్రజల ముందుకు రావాల్సి ఉంది. **కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం** ఈ వ్యవహారంపై కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జిల్లా అధికారి రాజశేఖర్ గౌడ్‌ను వివరణ కోరగా, డాక్టర్ రమేష్ ఫోన్‌లో అందుబాటులోకి రాలేదని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, శాఖాపరమైన చర్యల అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నట్లు సమాచారం. **విధులు ఎక్కడ.. వైద్యం ఎక్కడ?** ప్రభుత్వ వైద్యుడి విధులు, ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహణ రెండూ ఒకేసారి కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. హాజరు రిజిస్టర్లు, డ్యూటీ రోస్టర్, జీతం చెల్లింపుల వివరాలు, సెలవుల రికార్డులు, ప్రైవేట్ ప్రాక్టీస్‌కు సంబంధించిన అనుమతులు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఎంవీఎస్ నర్సింగ్‌హోమ్‌లో జరిగిన రెండు మరణాలపై వైద్య నిపుణుల కమిటీతో స్వతంత్ర విచారణ జరిపి, మరణాలకు అసలు కారణాలను వెల్లడించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి విధులు ఒక రాష్ట్రంలో.. ప్రైవేట్ వైద్యం మరో రాష్ట్రంలో కొనసాగుతున్నదా? అన్న ప్రశ్నకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు తప్పని తేలితే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని పలువురు కోరుతున్నారు. ఇద్దరు మహిళల మృతిపై వైద్యపరమైన విచారణతో పాటు, ప్రభుత్వ వైద్యుడి విధులు, ప్రైవేట్ ప్రాక్టీస్ వ్యవహారంపైనా తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సతీష్‌రెడ్డిని పరామర్శించిన బడే నాగజ్యోతి

- సర్జరీ అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**ములుగు, సెప్టెంబర్ 26 (పిసీడబ్ల్యూ న్యూస్):** అనారోగ్య సమస్యతో సర్జరీ చేయించుకున్న మాజీ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై. సతీష్‌రెడ్డిని ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిజగదీష్ పరామర్శించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డిని కలిసి ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సర్జరీ అనంతరం ఆరోగ్యం ఎలా ఉందనే విషయాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సతీష్‌రెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ కార్యకలాపాల్లో పాల్గొనాలని బడే నాగజ్యోతి ఆకాంక్షించారు. అనారోగ్య సమయంలో ఆయనకు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు అండగా నిలవాలని పేర్కొన్నారు. సతీష్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు పోరిక విజయరాం నాయక్, బీఆర్ఎస్‌వీ నాయకులు కొమరం సిద్ధు, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇమ్మడి ఓదెలు కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు


**మల్లంపల్లి సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి ఓదెలు తల్లి ఇమ్మడి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, ఇమ్మడి లక్ష్మి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, మల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పొనుగంటి రవీందర్, కక్కర్ల సాంబయ్య, వార్డు సభ్యుడు కొంగరి నరేందర్, అంకం మహేందర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## మోడీ పాలనను నిరసిస్తూ డిసెంబర్‌లో జైల్‌భరో

**డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు: సీపీఐ**

**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి: బాగం హేమంతరావు**




**ఖమ్మం, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో దేశవ్యాప్తంగా జైల్‌భరో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాన్ని విస్తృతం చేస్తామని చెప్పారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, చెరువులు, కుంటలను నీటితో నింపే చర్యలు చేపట్టాలని కోరారు. దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో న్యాయవాది ఇజ్జగిరి సురేష్ సోదరి కన్నుమూత

**- ఆదివారం ఉదయం 10 గంటలకు గుండ్లసింగారంలో అంత్యక్రియలు**




**హనుమకొండ, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ 20 సంవత్సరాల ఈసీ సభ్యుడు ఇజ్జగిరి సురేష్ సోదరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి వార్త తెలుసుకున్న న్యాయవాదులు, బంధువులు, సన్నిహితులు సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలి అంత్యక్రియలను నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు గుండ్లసింగారంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. అంత్యక్రియలకు న్యాయవాద మిత్రులు, బంధువులు, స్నేహితులు హాజరై మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేయాలని కోరారు. కుటుంబానికి ఈ విషాద సమయంలో అండగా నిలిచి, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ఆకాంక్షించారు.

## పింఛన్‌లో రూ.16 ఎక్కడికి పోతున్నాయి ?

- నెలకు రూ.10 వేలకు పైగా వసూలవుతున్నాయంటూ ఆరోపణలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పింఛన్‌దారుల ఆవేదన




**ములుగు సెప్టెంబర్ 26 పిసిడబ్ల్యూ న్యూస్:** ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని పలు పోస్టాఫీసుల పరిధిలో పింఛన్ల పంపిణీ సమయంలో ఒక్కో పింఛన్‌దారుడి నుంచి రూ.16 చొప్పున తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పింఛన్ మొత్తంలో రూ.16 ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే, ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందిస్తున్నందుకు ఆ మొత్తాన్ని తీసుకుంటున్నామని సిబ్బంది చెబుతున్నారని పలువురు పింఛన్‌దారులు వాపోతున్నారు. మండలంలోని కొన్ని పోస్టాఫీసుల పరిధిలో సుమారు 500 నుంచి 700 మంది వరకు పింఛన్‌దారులు ఉన్నట్లు సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ.16 చొప్పున వసూలు చేస్తే నెలకు వేలాది రూపాయలు వసూలవుతున్నాయని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పింఛన్‌దారులు కోరుతున్నారు. అయితే కొన్ని పోస్టాఫీసుల పరిధిలో పింఛన్‌దారులకు పూర్తి మొత్తాన్ని అందిస్తున్నట్లు సమాచారం ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం రూ.16 ఎందుకు ఇవ్వడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంటి వద్ద పింఛన్ అందిస్తున్నందుకు రూ.16 తీసుకోవడం నిబంధనల్లో ఉందా? ఉంటే అన్ని పోస్టాఫీసుల్లో ఒకే విధంగా ఎందుకు అమలు చేయడం లేదని పింఛన్‌దారులు ప్రశ్నిస్తున్నారు. రూ.16 ఎందుకు తీసుకుంటున్నారని సిబ్బందిని ప్రశ్నిస్తే, మేము వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందిస్తున్నాం. అంటూ సమాధానం ఇస్తున్నారని, మరికొన్ని సందర్భాల్లో ఏం చేసుకుంటారో చేసుకోండి అన్నట్లుగా మాట్లాడుతున్నారని పింఛన్‌దారులు ఆరోపిస్తున్నారు. పింఛన్‌దారుల నుంచి అదనపు మొత్తాల వసూళ్లపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఓ మగువా.. నీ తెగువకు జోహార్!

- చాకలి ఐలమ్మకు ఘన నివాళి
- అన్యాయంపై అలుపెరుగని పోరాటం..
- ప్రతి ఆడబిడ్డకు ఆత్మగౌరవ స్ఫూర్తి ఐలమ్మ ఆశయాలను భావితరాలు కొనసాగించాలి
- బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం నగర కార్యవర్గ సభ్యుడు, 58వ డివిజన్ ఇన్‌చార్జి ఆరెంపల వీరభద్రం



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అణచివేతకు తలవంచకుండా ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె చూపిన తెగువ ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం నగర కార్యవర్గ సభ్యుడు, 58వ డివిజన్ ఇన్‌చార్జి ఆరెంపల వీరభద్రం అన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం ఖమ్మం నగరంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆరెంపల వీరభద్రం మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో పుట్టిన ఓ మహిళ అన్యాయాన్ని ప్రశ్నించి, తన హక్కు కోసం ధైర్యంగా నిలబడటం ద్వారా చరిత్రలో చెరగని ముద్ర వేసిందని అన్నారు. నైజాం పాలన కాలంలో భూస్వాములు, రజాకారుల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ పోరాటం కేవలం ఒక వ్యక్తి కోసం జరిగిన పోరాటం కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కులు, స్వేచ్ఛ కోసం సాగిన పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఐలమ్మ చూపిన ధైర్యం నేటి మహిళలకు గొప్ప సందేశమని అన్నారు. మహిళలు తమలోని శక్తిని గుర్తించి, అన్యాయం ఎదురైనప్పుడు ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మహిళ బలహీనురాలు కాదని.. సంకల్పం ఉంటే సమాజాన్ని కదిలించే శక్తి ఆమెకు ఉందని ఐలమ్మ జీవితం నిరూపించిందని అన్నారు. చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను పుస్తకాల్లోని ఓ అధ్యాయంగా మాత్రమే కాకుండా, భావితరాలకు మార్గదర్శకంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజం లో అన్యాయం, వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా నిలబడాలని, సమానత్వం, ఆత్మగౌరవం, మానవత్వం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "జోహార్ చాకలి ఐలమ్మ.. జోహార్! ఐలమ్మ ఆశయాలను సాధిద్దాం.. ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం" అని ఆరెంపల వీరభద్రం పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ టౌన్ ఈసీ మెంబర్ ఆరెంపల వీరభద్రం, ఉద్యమకారులు, త్రీటౌన్ ఎస్సీ సెల్ నాయకులు నారమళ్ల వెంకన్న తదితర ముఖ్య నాయకులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు



**రామడుగు, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచిన వీరవనిత చిట్యాల ఐలమ్మ 131వ జయంతి వేడుకలను రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో శివగంగ మడేల్ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పోషించిన ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పైండ్ల హనుమంతు, ప్రధాన కార్యదర్శి పైండ్ల తిరుపతి, ఉపాధ్యక్షులు లింగంపల్లి అంజయ్య, కోశాధికారి పున్న కనకయ్య, కార్యవర్గ సభ్యులు పైండ్ల రాములు, పైండ్ల నితిన్, పైండ్ల మధు, సంఘం సభ్యులు పైండ్ల కొమురయ్య, పున్న మల్లేశం, వర్కోలు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# నేరడ ఎస్ఓ టర్మినేషన్‌పై వివాదం.. ఆడియోపై విచారణకు డిమాండ్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 26 (పీసీడబ్ల్యూ ప్రత్యేక ప్రతినిధి):** కురవి మండలం నేరడ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సరస్వతి టర్మినేషన్ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. తనను టర్మినేషన్ చేయిస్తానంటూ ఓ వ్యక్తి ఫోన్‌లో హెచ్చరించినట్లు ఉన్న ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆ వ్యక్తిని జీసీఈఓ గాయత్రి భర్తగా కొందరు పేర్కొంటున్నప్పటికీ, ఆడియోలో మాట్లాడింది ఎవరు, సంభాషణ ఎప్పుడు జరిగిందనే విషయాలపై అధికారిక నిర్ధారణ లేదు. తనపై తీసుకున్న టర్మినేషన్ చర్యలను పునఃపరిశీలించాలని ఎస్ఓ సరస్వతి కోరుతున్నట్లు తాజా కథనం పేర్కొంది. విద్యార్థినికి అత్యవసర వైద్యం అందించిన పరిస్థితులను, అలాగే విద్యార్థినులపై జరిగిన ఘటనను తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, నేరడ కేజీబీవీలో విద్యార్థినులపై సీఆర్‌టీ దాడి ఘటనపై విచారణ అనంతరం ఎస్ఓ సరస్వతి, సీఆర్‌టీ సుహాసినికి చర్యలు తీసుకున్నట్లు మరో వార్తా కథనం పేర్కొంది. వైరల్ ఆడియో, టర్మినేషన్ ఉత్తర్వులు, ఇతర ఆరోపణలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని పలువురు కోరుతున్నారు.

# రేవంత్‌ది డైవర్షన్ పాలిటిక్స్: బీజేపీ

- 6 గ్యారంటీలు, హామీలను గాలికొదిలి కేసుల పేరుతో కాలయాపన: బోయినపల్లి ప్రవీణ్‌రావు



**కరీంనగర్, సెప్టెంబర్ 26 (పీసీడబ్ల్యూ న్యూస్):** చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను పక్కనపెట్టి కేసులు, విచారణల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలోని ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, గొర్రెల పథకం, ఫార్ములా–ఈ, ఓఆర్ఆర్ టెండర్ల తదితర అంశాలపై చర్యల పురోగతిని ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌పై నమోదైన కేసుల్లో ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రవీణ్‌రావు కోరారు.

# ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ

- మహిళా శక్తికి ఐలమ్మ జీవితం చిరస్మరణీయం: కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ఖమ్మం, సెప్టెంబర్ 26 (పీసీడబ్ల్యూ న్యూస్):** అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ఆమె ధైర్యసాహసాలు మహిళలు, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఖమ్మంవైరా రోడ్డులోని ఆమె విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతిప్రజ్వలన చేశారు. భూమి, హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆమె ఆశయాలైన సమానత్వం, ఆత్మగౌరవం, న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# రైతన్న కన్నీటికి అండగా.. రైతు కూలీల పోరాటానికి చేయూతనివ్వండి

- ఏఐకేఎంఎస్ అఖిల భారత మహాసభలకు సంఘీభావం తెలపాలి: పిడిఎస్యూ పూర్వ నాయకుల పిలుపు




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం సాగుతున్న పోరాటాలకు సమాజం అండగా నిలవాలని పిడిఎస్యూ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల ప్రదీప్, పి. ప్రసాద్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి ఖమ్మం నగరంలో జరగనున్న ఆల్ ఇండియా రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో అఖిల భారత మహాసభలకు ప్రజలు సంఘీభావం, సహకారం అందించాలని కోరారు. మహాసభల నేపథ్యంలో స్థానిక వేదిక ఫంక్షన్ హాల్‌లో శనివారం పిడిఎస్యూ పూర్వ మిత్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పిడిఎస్యూ పూర్వ నాయకురాలు మణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బూర్గుల ప్రదీప్, పి. ప్రసాద్ మాట్లాడారు. వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతులు, రైతు కూలీల సమస్యలపై విస్తృత చర్చ అవసరమన్నారు. నూతన విత్తన విధానం, విద్యుత్ సవరణ బిల్లు, గతంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు వంటి అంశాలపై రైతు సంఘాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను వారు ప్రస్తావించారు.

చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల జీవన భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రైతు ప్రకృతి వైపరీత్యాలు, పెట్టుబడి భారాలు, అప్పుల సమస్యలను ఎదుర్కొంటూ పంటలు పండిస్తున్నారని, వ్యవసాయ కూలీలు కూడా ఆర్థిక, సామాజిక భద్రతకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతుకూలీల సమస్యలు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా ఆహారం, ఉపాధి, ధరలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. యువత రైతాంగ సమస్యలపై అవగాహన పెంచుకోవాలని, శ్రమకు గౌరవం, రైతుకు గౌరవం, రైతు కూలీకి గౌరవం అనే భావనను బలపరచాలని పిలుపునిచ్చారు. రైతుకూలీల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో జరిగే పోరాటాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్. వెంకటేశ్వరరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కాకి భాస్కర్, ఎం. పుల్లయ్య, గుర్రం నాగయ్య, ఎం. శ్రీనివాస్, తాలూరి వేణు, చిర్రా రవి, విజయ్ దేవరెడ్డి, ఎన్. తిరుమల్, న్యాయవాదులు పురుషోత్తం, బి. తిరుమల, విప్లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలంపల్లిలో ఘనంగా 'పోషణ్ మహా' కార్యక్రమం.. హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలం పోలంపల్లి అంగన్వాడి కేంద్రంలో 'పోషణ్ మాస్' ప్రోగ్రాంలో భాగంగా ప్రత్యేకంగా పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ ఈ సంవత్సరం సెప్టెంబర్ 9 వ తేదీ నుండి అక్టోబర్ 8 వ తేదీ వరకు పోషణ్ మాస్ కార్యక్రమాలను ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. "మన అంగన్వాడి – మన బాధ్యత" అనే భావనతో అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరైన పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. కేవలం పౌష్టికాహారమే కాకుండా, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, పోలంపల్లి గ్రామ సర్పంచ్ లావణ్య, నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ రవీందర్, సిడిపిఓ శ్రీలత, డాక్టర్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్ పద్మ, హైస్కూల్ హెచ్ఎం, ఉప సర్పంచ్‌లు, పోషణ్ అభియాన్ డిసి ప్రమీల, బీసీ ప్రణీత, సఖి కవిత, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పిల్లలు, కిశోర బాలికలు మరియు తల్లులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కులవృత్తులకు అండగా ప్రజా ప్రభుత్వం: మంత్రి పొన్నం ప్రభాకర్




**కరీంనగర్, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇందిరా భవన్‌లో కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం తొలి మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కులవృత్తులను ఆధారంగా చేసుకుని జీవిస్తున్న కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు బీమా, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశువుల పెంపకానికి అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించి వినియోగించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. కులవృత్తిదారులకు 50 ఏళ్లకే పెన్షన్ అందించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారమని, గొర్రెల పెంపకందారులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు పశు వైద్య సేవలు, బీమా, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, పశుపోషకుల ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

# మానవత్వానికి ప్రతిరూపంగా 'శ్రీ చైతన్య' సేవలు

**● 130 మంది గ్రామస్తులకు ఉచిత నేత్ర పరీక్షలు**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్-ఎస్ సెల్, మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో తల్లంపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 130 మంది గ్రామస్తులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. తల్లంపాడు సర్పంచ్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సేవాభావం, సామాజిక బాధ్యత, మానవీయ విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ స్ఫూర్తితో విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ వి. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇన్‌చార్జి కృష్ణ ప్రసాద్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నరేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**- బైపాస్ రోడ్డులో సిపిఐ రాస్తారోకో**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు కళంకం తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల అభిప్రాయాలను పక్కదారి పట్టించిన జ్ఞానేష్కుమార్ దేశ ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు. బిజెపికి తొత్తుగా వ్యవహరించిన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ గుట్టు రట్టయిన తర్వాత మోడీ, అమిత్‌అల బండారం బయటపడిందన్నారు. ప్రజా బలంతో కాకుండా ఎన్నికల సంఘం మాయాజాలంతో బిజెపి అధికారంలోకి వచ్చిందన్న విషయం స్పష్టమైందని సురేష్ తెలిపారు. దేశంలో జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ బిజెపి చెప్పు చేతల్లో పెట్టుకున్నారని రాజ్యాంగ సంస్థలు ఇప్పుడు ప్రజల కోసం కాకుండా బిజెపి కోసం పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ధరల నియంత్రణ, కార్మిక చట్టాల రద్దు, నూతన సాగు చట్టాలు, ఇలా అన్ని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని సురేష్ ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. రాజీనామా తర్వాత ఆయనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని "సురేష్ డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, దొండపాటి రమేష్, జాగర్లమూడి రంజిత్, బెజవాడ రవి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, మల్లికార్జున్, యానాలి సాంబశివరెడ్డి, యంగల ఆనందరావు పాల్గొన్నారు.

# మోడీ పాలనను నిరసిస్తూ జైల్భరో

**● సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** మోడీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రజలను చైతన్యపరిచి, డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో జైల్భరో కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, ప్రజా సమస్యలను పక్కనపెట్టి కార్పొరేట్లకు అనుకూల విధానాలను అమలు చేస్తోందని హేమంతరావు ఆరోపించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందన్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు ఇతర హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలన్నారు. వర్షాలు, ఎల్నినో ప్రభావంతో నష్టపోయే రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. వృథాగా పోతున్న వర్షపు నీటిని చెరువులు, కుంటలకు మళ్లించి నీటి సంరక్షణ చేపట్టాలని, సాగర్ ఎడమ కాలువ ద్వారా జిల్లాలోని చెరువులను నింపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎం.ఎం. టవర్స్ వెనుక సీసీ డ్రెయిన్ పనులకు శ్రీకారం..



**కరీంనగర్, సెప్టెంబర్26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా ముకరంపుర డివిజన్‌లోని ఎం.ఎం. టవర్స్ వెనుక భాగంలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు ఈరోజు ప్రారంభమైనట్లు ఎఐఎంఐఎం కార్పొరేటర్ మొహమ్మద్ మజీద్ హుస్సేన్ తెలిపారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా, మురుగునీరు సక్రమంగా పారేలా సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. డ్రెయిన్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ షకీర్ మోయిన్ (ఫైసల్) నిర్వహిస్తున్నారని చెప్పారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.

# కమలాపూర్‌లో శనివారం ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం

**● సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో స్వచ్ఛ కమలాపూర్ కార్యక్రమం ● 20వ వారం కొనసాగిన శ్రమదాన కార్యక్రమం**



**కమలాపూర్ సెప్టెంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా ప్రతి శనివారం ముందుకు సాగుతున్న ఊరు కోసం ఒక్కరోజు శ్రమదాన కార్యక్రమం సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో 20వ శనివారం నిర్వహించారు. 4 వ వార్డులో శ్రమదానం నిర్వహించి ముళ్ళపదలు పిచ్చి మొక్కలు చెత్తాచెదారం తొలగించారు. వార్డు ప్రజలకు స్వచ్ఛ కమలాపూర్ పై అవగాహన కల్పించారు. సర్పంచ్ పబ్బు సతీష్ ను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని మండల ప్రజలు చర్చించుకుం టున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాయకులు మార్క అశోక్,ఆవునూరి తిరుపతి,పిల్లి సతీష్,ఎండపల్లి మల్లారెడ్డి,రాం శెట్టి రాజయ్య, తుమ్మ రాజేష్, గంధసిరి బిక్షపతి,పుల్ల ఐలయ్య, సిబ్బంది యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నూర్‌లో కూరగాయల అంగడి ప్రారంభం

**● ప్రారంభించిన గ్రామ సర్పంచ్ పుల్లూరి శోభారాణి**

**● ప్రతి శనివారం జరిగే సంతను ప్రజలు సద్వినియోగం చేసుకోగలరు**



**కమలాపూర్ సెప్టెంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కన్నూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం కూరగాయల సంతను గ్రామ సర్పంచ్ పుల్లూరి శోభారాణి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కన్నూర్,రాముల పల్లె,కొత్తపల్లి గ్రామ ప్రజలు ప్రతి శనివారం జరిగే కూరగాయల సంతను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వేణుగోపాలస్వామి గుడి దగ్గర ఏర్పాట్లు చేశారు. మండల ంలోని గ్రామ ప్రజలు అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. గుడి వద్ద సౌకర్యాలు మౌలిక వసతులు గ్రామపంచాయతీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కన్నూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ గౌడ్, కొత్తపల్లి సర్పంచ్,కన్నూర్, కొత్తపల్లె,ఉపసర్పంచ్ లు పాలకవర్గ సభ్యులు,ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు మహిళలు, యువకులు,వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,వ్యాపారులు, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# దీమెస్సీయ జన్మదినమే పర్ణశాలల పండుగ

**- ప్రారంభమైన 'సుక్కోత్' మొదటి దినం**

**- యావె సమాజ ప్రార్థన మందిర పాస్టర్ పాలడుగు రత్నపాల్**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్) :** లోక రక్షకుడు యాషువ మెస్సీయ అని యావె సమాజ ప్రార్థన మందిర పాస్టర్ పాలడుగు రత్నపాల్ అన్నారు. యాషువ మెస్సీయ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీలోని జివిర్ ఫంక్షన్ హాల్లో పర్ణశాలల పండుగ మొదటిదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్ణశాలల పండుగ గురించి పాస్టర్ రత్నపాల్ మాట్లాడుతూ.. లోకపాప పరిహారార్థమై యాషువ మెస్సీయ వారు జన్మించారు. నమ్మినవారు ధన్యులు వారిదే పరలోకరాజ్యం అన్నారు. యాషువ మెస్సీయ జన్మదినమైన పర్ణశాలల పండుగ బైబిల్ క్యాలెండర్ ప్రకారం 7వ నెల ఏతనీము 15వ తేదీన పుట్టాడని, దానినే పర్ణశాలల పండుగ అంటారని తెలిపారు బైబిలంతటిలో ప్రవక్తలు, యాషువ మెస్సీయ, శిష్యులు, అపోస్తులలు పండుగను అనుసరిస్తూ ఆచరించారని పేర్కొన్నారు. ఇది ఎనిమిది దినములు ఉత్సవముతో కూడిన పర్ణశాలల పండుగని, ఇది దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయుల ఆచారమన్నారు. పర్ణశాలల పండుగ గూర్చి బైబిల్ అంతటిలో 359 సార్లు గొప్పగా వ్రాయబడిందని, ఇది సెప్టెంబర్-అక్టోబర్లో వచ్చే పౌర్ణమికి దగ్గరగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సమేతంగా ఆచరించాల్సిన పండుగన్నారు. బైబిల్ పండుగలు (సబ్బాత్) విశ్రాంతిదినం, నెలపొడుపు దినం, ధర్మశాస్త్రము అనుసరించేవారు మాత్రమే పరలోక రాజ్యానికి వారసులని స్పష్టం చేశారు. కానీ బైబిల్ లో లేని పండుగలు, దినాలు, సంఘాలను సృష్టించి, మానవ కల్పిత ఆచారాలను గ్రహించక అబద్ధబోదను ప్రకటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ ను క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో సత్యమైన వాక్యాన్ని గ్రహించి ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తి శ్రద్ధలతో విశ్వాసులు, యువకులు పాటలు పాడి ఆనందింపజేశారు. పండుగను పురస్కరించుకుని రాంపురం, వరంగల్, పైనంపల్లి, ఖమ్మం పట్టణం నుండి సుమారు 200మంది విశ్వాసులు పాల్గొన్నారు. ఈ పర్ణశాలల పండుగ మహోత్సవంలో మోదుగు మోసే, అంబోజి జీవరత్నం, బాసిపంగు ప్రసాద్, ప్రశాంత్, పౌలు (రూప్లా), కొరకొప్పుల డేవిడ్, గడ్డం ఏబేలు, పాలడుగు జీవన్, మనోహ, పాలడుగు అనిత, కొరకొప్పుల సునీత, రిబ్కా, రూతు, స్వరూప, సుజాత, కళమ్మ, పుష్పమ్మ, ఎస్తేరు, వంగూరి సౌజన్య, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఫ్లాపులు తట్టుకోలేక పరేషాన్ అవుతున్న బ్యూటీలు!







వెండితెరపై కథానాయిక అందంగా ఉండాలి .. ఆకర్షణీయంగా అనిపించాలి. దిష్టి చుక్క పెట్టని చందమామలా కనిపించాలి. లేదంటే ఆడియన్స్ నిరాశపడిపోతారు .. నిరుత్సాహానికి లోనవుతారు. తెరపై సమాజసేవలో అలసిపోయిన నాయకుడికి .. ఆ నాయకుడికి విజిల్స్ కొట్టి విసిగిపోయిన ఆడియన్స్ కి కాస్త ఉపశమనాన్ని కలిగించేది హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి హీరోయిన్ అందంగా ఉండాలని అనుకోవడంలోను తప్పులేదు.

అభిమానుల మనసు దోచుకుంటూ .. అవకాశాలను అందుకుంటూ .. విజయాలను సొంతం చేసుకోవడం అంత తేలికైన విషయమేం కాదు. ఇక్కడ హిట్టు తప్ప వాళ్లను కాపాడే మరో మంత్రమే లేదు. ఒకప్పుడు హీరోయిన్స్ ఏళ్లతరబడి ఏలుతూ వెళ్లారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. ఎంత గ్లామరస్ గా ఉన్నప్పటికీ .. ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ రెండు మూడు ఫ్లాపులు పడితే అంతే సంగతులు. మేకప్ కిట్ సర్దుకుని మరో ఇండస్ట్రీకి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు.

కృతి శెట్టి ఇచ్చిన ఎంట్రీ మామూలుగా లేదు. ఫస్టు మూవీతోనే 100 కోట్ల బ్యూటీగా మార్కులు కొట్టేసింది. అరుదైన ఫీట్ గా చెప్పుకునే హ్యాట్రిక్ హిట్ ను దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక కుదురుకున్నట్టే అనుకునేంతలోనే పరాజయాల పలకరింపు మొదలైంది. అప్పటి నుంచి కృతి శెట్టి ఇక్కడ కనిపించలేదు. ఆ సమయంలో వరుస విజయాలతో చెలరిగిపోయిన శ్రీలీలకి కూడా ఆ తరువాత ఫ్లాపులు తప్పలేదు. ఆమె జోరు తగ్గడానికి కూడా ఎక్కువ సమయం పట్టలేదు.

ఈ నేపథ్యంలోనే విశాలమైన కళ్లతో విన్యాసాలు చేసుకుంటూ భాగ్యశ్రీ బోర్సే తెరపైకి వచ్చింది. అమ్మాయి గ్లామర్ కి వంకబెట్టవలసిన అవసరం లేదని ఆడియన్స్ అనుకున్నారు. కుర్రాళ్లంతా కూడబలుక్కుని ఆమె అభిమానుల జాబితాలో చేరిపోయారు. కానీ సక్సెస్ అనేక విధాలుగా ఆమెతో దోబూచులాడుతూనే వచ్చింది. దాంతో ఆమె కూడా ఇతర భాషా చిత్రాల వైపు అడుగులు వేయవలసి వచ్చింది. ఎంత అందంగా ఉన్నా .. టాలెంట్ ఉన్నా కొంత కాలం కూడా నిలదొక్కుకోలేక పోతుండటం నిజంగా విచారించదగిన విషయమే.

# ‘జైలర్ 2‘ .. వెయ్యికోట్ల మాట!



రజనీకాంత్ కి ఉన్న క్రేజ్ గురించి .. ఆయన సినిమాలకి గల మార్కెట్ ను గురించిగాని ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఒకానొక సందర్భంలో సీనియర్ దర్శకులతో మాత్రమే సినిమాలు చేస్తూ వెళ్లిన రజనీకాంత్, ఆ తరువాత యువ దర్శకులతో సినిమాలు చేయడానికి ఉత్సాహాన్ని చూపుతూ వెళ్లారు. అందుకు నిదర్శనంగా తెరపైకి వచ్చిన సినిమాలే ‘కబాలి‘ .. ‘కాలా‘ .. ‘జైలర్‘. అప్పటివరకూ తెరపై కనిపిస్తూ వచ్చిన రజనీని లుక్ పరంగా కొత్తగా ఆవిష్కరించిన సినిమాలు ఇవి.రజనీకాంత్ కెరియర్ లో సూపర్ హిట్లు .. బ్లాక్ బస్టర్ సినిమాలు చాలా ఉండొచ్చు. అయితే ఆ జాబితాలో ప్రత్యేకంగా కనిపించే సినిమాగా ‘జైలర్‘ ను గురించి చెప్పుకోవచ్చు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, 600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. చాలా వేగంగా ఈ మార్కును అందుకున్న సినిమాగా ఇది నిలిచిపోయింది. రజనీ ఛరిష్మా ఎంతమాత్రం తగ్గలేదని నిరూపించిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమాకి ఇప్పుడు సీక్వెల్ రెడీ అవుతోంది. దసరా కానుకగా అక్టోబర్ 15వ తేదీన ఈ సినిమాను భారీస్థాయిలో విడుదల చేయనున్నారు. 300 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మితమవుతున్న ఈ సినిమా, వెయ్యికోట్లకి పైగా వసూళ్లను రాబట్టడం ఖాయమనే మాట చాలా బలంగా వినిపిస్తోంది. మిథున్ చక్రవర్తి .. ఎస్ జె సూర్య .. విద్యాబాలన్ .. రమ్యకృష్ణ వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలకమైన పాత్రలలో కనిపించనున్నారు. అనిరుధ్ నేపథ్య సంగీతం ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకువెళుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దసరాకి ఈ సినిమా ఏ రేంజ్ లో సందడి చేస్తుందనేది చూడాలి మరి.

# విజయ్ కొడుకుపై ప్రశంసలు, ‘కాకా’పై ధీమా!

## ‘సిగ్మా’ వేడుకలో చిరంజీవి..




సందీప్ కిషన్ కథానాయకుడిగా, దళపతి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘సిగ్మా’ చిత్ర ప్రీ-రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్ర బృందానికి తన ఆశీస్సులు అందించారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, "‘కాకా’ సినిమా షూటింగ్ నుంచి నేరుగా ఇక్కడికే వచ్చాను. యువ ప్రతిభను ప్రోత్సహించడం నా బాధ్యతగా భావిస్తాను. సందీప్ కిషన్ నాకు కుటుంబ సభ్యుడి వంటి వాడు. ‘ప్రస్థానం’ నుంచి నేటి వరకు విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అతడిని చూస్తుంటే నా కెరీర్ తొలి రోజులు గుర్తుకువస్తున్నాయి” అని పేర్కొన్నారు.దర్శకుడు జేసన్ సంజయ్‌పై చిరు ప్రశంసల వర్షం కురిపించారు. “జేసన్ తాతగారు ఎస్.ఎ. చంద్రశేఖర్ దర్శకత్వంలో నేను ‘చట్టానికి కళ్లులేవు’, ‘దేవాంతకుడు’ వంటి సూపర్ హిట్ చిత్రాలు చేశాను. ఇప్పుడు ఆయన మనవడితో వేదిక పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. జేసన్‌ను చూస్తుంటే 90వ దశకంలోని విజయ్ గుర్తుకువస్తున్నాడు. తన తండ్రిలాగే జేసన్ కూడా వృత్తిలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడని ఆకాంక్షిస్తున్నాను” అని చిరంజీవి అన్నారు.

‘సిగ్మా’ టైటిల్ గురించి ప్రస్తావిస్తూ “గూగుల్ చేస్తే ఎవరి మాటా వినని వాడు అని అర్థం వచ్చింది. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా ఫస్ట్ కాపీ నాకే చూపించాలి” అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. హీరోయిన్ ఫరియా అబ్దుల్లాతో సరదాగా సంభాషించిన చిరంజీవి, సంగీత దర్శకుడు థమన్‌ను “రాముడికి హనుమంతుడి వంటి వాడు” అని కొనియాడారు. "‘కాకా’ రీ-రికార్డింగ్ పనులు అద్భుతంగా జరుగుతున్నాయి. ఈ సంక్రాంతి పక్కా మనదే” అంటూ తన చిత్రంపై ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# షూటింగ్‌కు ముందు ‘దృశ్యం 3‘ నుంచి తప్పుకున్న అక్షయ్ ఖన్నా

## నటుడి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన దర్శకుడు అభిషేక్ పాఠక్



బాలీవుడ్ ప్రముఖ నటుడు అజయ్ దేవగణ్ కథానాయకుడిగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ ‘దృశ్యం 3‘ సెట్స్‌పైకి వెళ్లే ముందే వివాదాల్లో చిక్కుకుంది. సినిమా షూటింగ్ ప్రారంభానికి కేవలం వారం రోజుల ముందు, కీలక పాత్ర కోసం ఎంపికైన నటుడు అక్షయ్ ఖన్నా ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. ఈ అనూహ్య పరిణామంపై చిత్ర దర్శకుడు అభిషేక్ పాఠక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఉదంతంపై ఆయన స్పందిస్తూ, “ఒక నటుడు ఒప్పందంపై సంతకం చేసి, పారితోషికం అందుకున్న తర్వాత అర్థాంతరంగా సినిమా నుంచి తప్పుకోవడం సరైన పద్ధతి కాదు. వారి బాధ్యతారాహిత్యం వల్ల నిర్మాతలు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. రోజుకు రూ. 2,000 నుంచి రూ. 3,000 సంపాదించే ఎంతో మంది సినీ కార్మికుల జీవనోపాధిపై ఇది ప్రభావం చూపుతుంది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ముందే చర్చించి పరిష్కరించుకోవాలి“ అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే నటులను కట్టడి చేసేందుకు చిత్ర పరిశ్రమలో కఠినమైన చట్టాలు, నిబంధనలు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.కాగా, ఈ వ్యవహారంలో చిత్ర నిర్మాత, అభిషేక్ తండ్రి కుమార్ మంగత్ పాఠక్ ఇప్పటికే అక్షయ్ ఖన్నాకు లీగల్ నోటీసులు పంపారు. అక్షయ్ తప్పుకోవడంతో, ఆయన పోషించాల్సిన ఐజీ తరుణ్ అహ్లావత్ పాత్రను చిత్ర బృందం పూర్తిగా మార్చివేసింది. ఆ స్థానంలో ఎస్పీ రాజ్‌వీర్ సింగ్ తోమర్ అనే మరో శక్తిమంతమైన పాత్రను సృష్టించి, ఆ పాత్ర కోసం నటుడు జైదీప్ అహ్లావత్‌ను ఎంపిక చేశారు. ‘దృశ్యం‘ ఫ్రాంచైజీలో చివరి భాగంగా రానున్న ఈ చిత్రంలో అజయ్ దేవగణ్, శ్రియ, టబు, ఇషితా దత్తా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను 2026 అక్టోబర్ 2న విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.




# క్యారెక్టర్ లేని వాళ్లను దూరంగానే ఉంచాలి!

మానవ సంబంధాలలో నమ్మకం, ఆత్మగౌరవం అత్యంత కీలకమైనవని.. క్యారెక్టర్ (ప్రవర్తనా శైలి) సరిగ్గా లేని వారిని, స్వార్థపరులను ఎల్లప్పుడూ దూరంగానే ఉంచాలని నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. చిత్ర పరిశ్రమలో దశాబ్దానికి పైగా అగ్ర కథానాయికగా వెలిగిన అమ్మడు వ్యక్తిగత జీవితంలోనూ పరిణతి సాధించిన కాజల్ సంబంధాలు , మానసిక ప్రశాంతతపై చేసిన వ్యాఖ్యలు ఆకట్టుకుంటున్నాయి. ప్రేమ, స్నేహం, కుటుంబం లేదా ఉద్యోగం చేసే చోట.. ఎక్కడైనా సరే నమ్మకద్రోహానికి ఒడిగట్టే వ్యక్తులకు జీవితంలో స్థానం ఉండకూడదని పునరుద్ఘాటించారు. బంధాలన్నింటికీ పునాది నమ్మకమేనని, ఆ నమ్మకం ఒకసారి ఒమ్మయితే మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడం అసాధ్యమని కాజల్ అభిప్రాయపడ్డారు. మన ప్రాణ స్నేహితులైనా? ప్రేమించిన వారైనా లేదా పని చేసే చోట సహచరులైనా సరే.. స్వార్థ పూరిత ఆలోచనలతో నమ్మకాన్ని తుంగలో తొక్కే వారితో కలిసి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. పైకి నవ్వుతూ లోపల స్వార్థాన్ని దాచుకునే వ్యక్తులను గుర్తించి, వారికి తగిన దూరంలో ఉండటమే శ్రీరామరక్ష అన్నారు.కవలం తమ స్వార్థం, అవసరాల కోసమే సంబంధాలను వాడుకునే మానసిక తత్వం ఉన్నవారు ప్రతి రంగంలోనూ ఉంటారని కాజల్ వ్యాఖ్యానించారు. అలాంటి వారు మన బలహీనతలను ఆసరాగా చేసుకుని, అవసరం తీరాక వెన్నుపోటు పొడవడానికి కూడా వెనుకాడరని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఎవరినైనా మన జీవితంలోకి లేదా వ్యక్తిగత పరిధిలోకి ఆహ్వానించే ముందు వారి క్యారెక్టర్, ఆలోచనా ధోరణిని గమనించడం ఎంతో అవసరమని ఆమె సూచించారు. ముఖ్యంగా పని చేసే ప్రదేశాల్లో వృత్తిపరమైన సరిహద్దులు కాపాడుకోవడం ముఖ్యమని కాజల్ పేర్కొన్నారు. పని చేసే చోట అసూయ, స్వార్థం, వెన్నుపోటు పొడిచే మనస్తత్వాలు ఉన్నవారిని ఎంత దూరంగా ఉంచితే కెరీర్‌కు, మానసిక ఆరోగ్యానికి అంత మంచిదన్నారు. విషపూరితమైన వాతావరణం లేదా వ్యక్తుల నుంచి వెంటనే బయటకు రావడం లేదా వారిని దూరంగా పెట్టడం ద్వారా మాత్రమే పనిపై సరిగ్గా దృష్టి పెట్టగలమని అభిప్రాయపడ్డారుసినీ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన కాజల్ అగర్వాల్, వివాహం తర్వాత తల్లిగా మారాక జీవితం పట్ల దృక్పథం మరింత స్పష్టంగా మారిందని తెలిపారు. అనుభవంతో వచ్చే పరిణతి వల్ల జీవితంలో ఎవరికి ఎంతవరకు స్థానం ఇవ్వాలో అర్థమవుతుందన్నారు. ఆత్మగౌరవంతో బతకడం, అనవసరమైన డ్రామాలకు చోటు ఇవ్వకుండా ప్రశాంతంగా జీవించడమే మొదటి ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ జీవితంలో ఈ సూత్రాన్ని పాటించాలని కోరారు. రూపానికో? హోదాకో? విలువ ఇవ్వడం కంటే వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వడమే నిజమైన వివేకమని కాజల్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.